# విందు



కోరుకొండ సత్యనారాయణ

తనకే తెలియని గమ్యం చేరుకోవడానికి తిరిగే సూర్యుడ్లా, అతనిచుట్టూ గిరిటీలు కొట్టే గ్రహాల్లా... 'సత్తి'గాడి కళ్ళు తిరుగుతున్నాయి ... నీరసంగా తిరుగుతున్నాయి . నిస్సత్తువగా తిరుగుతున్నాయి

ఆ కళ్ళల్లో కాంతిలేదు తళుక్కున మెరిసే మెరుపు లేదు సంతోషపు ఛాయ లేదు

గొంతులో స్వరంలేదు గుండెలో రక్తంలేదు కడుపులో తిండిలేదు

ఖాళీ ప్రేవులు కరకరమంటూ భరత నాట్యం చేస్తున్నాయి

గుండెలో ఎంకిపోయిన రక్తం . కడుపులో మండిపోతున్న ఆకలి.... గొంతులో పూడ్చుకుపోయిన స్వరం

'సత్తి' అంటే **ఆరడుగుల** భారీ రాజ విగ్రహంకాదు ఐపోయిన అంతర్జాతీయ బాలల సంవత్సరం విసురుగా కాలితో తన్నగా 'ఉకీ' మని ఒక వర్గం జాబితాలో పడిపోయిన ఆంధ్రదేశం ఉరఫ్ 'అన్నపూర్ణ' ఏడేళ్ళ కొడుకు....

వాడి కళ్ళు అటువైపే చూస్తున్నాయి వాడి మెదడు వాటిగురించే ఆలోచిస్తున్నాయి

ఆ చూపులు ముష్టివి ఆ ఆలోచనలు ముష్టివి. . వాడి మెదడు ముష్టిది వాడే ముష్టివాడు.

దేదీప్యమానంగా వెలుగుతున్న దీపాలకాంతిలో ఎంతో సంతోషం . ఎన్నో ఆనందపు కబుర్లు.... అక్కడ ఆనందదేవత పదహారేళ్ళ పడుచుపిల్లలా పరుగులు తీస్తుంది ... అందరి గుండెల్లో ఆనందపు వర్షాన్ని కురిపిస్తుంది

అక్కడెందుకో పెద్ద పార్టీ జరుగుతుంది .. విందు ఏర్పాటుచేసారు ఆరుబయట రకరకాల పదార్థాలు. చల్లని పానీయాలు

గేటువారగా 'సత్తి' నిల్చొని లోపలకు చూస్తున్నాడు అతని గుండెలో ఈ భూగోళం అంత విషాదం ఉంది కడుపులో ఈ విశ్వమంత ఆకలి ఉంది... అంత సంతోషంగా ఉన్న వాళ్ళను చూస్తుంటే సత్తికి వాళ్ళు దేవతల్లా కన్పిస్తున్నారు

అక్కడ కోటి దీపాల వెలుగులు సత్తిగాడి గుండెల్లో బాంబులు

గేటుకు 'కుక్కలున్నాయి జాగ్రత్త' అన్న బోర్డు కట్టిఉంది అది ఆ ఇంట్లో

కుక్కలు కూడా ఉన్నాయి అన్న విషయాన్ని తెలిపే బోర్డు అని సత్తిగాడికి తెలీదు .. ఎందుకంటే వాడు చదువుకో (వడం) లేదు

వాడికి చదువులేదు . ఒంటిమీద గుడ్డలేదు తలకింత నూనెలేదు... కళ్ళల్లో కాంతిలేదు ... మనసులో ఆనందం లేదు. కడుపులో తిండిలేదు .. ఎందుకంటే ప్రాణాలకు తెగించి పెద్దపెద్ద వాళ్ళ దగ్గర్నుండి డబ్బును కొట్టేసి అనాధలకు ఆ డబ్బును ధారాళంగా ఖర్చుచేసే తెలుగు సిన్మా నాయకుడెవరూ సత్తిగాడికి తారసపడలేదు.

సత్తిగాడెందుకిలా అయ్యాడు. ?

మొగ్గ విచ్చుకొని పూవౌవుతుంది నెత్తిమీదకు తెల్లటోపీ వెళ్తే కడుపు దానంతటికదే ముందుకొస్తుంది అన్న విషయాలు వేరే చెప్పాలా ?

దేవుడు మనుషుల్ని తయారుచేసి కుప్పలు కుప్పలుగా బుట్టల్తో పైనుండి ఒంపేస్తున్నాడు కొందరు మేడల్లో, మిద్దెల్లో.. కొందరు కార్లల్లో... కొందరు విమానాల్లో మరికొందరు పార్లమెంటులో. మన సత్తిగాడిలాంటి వాళ్ళు పేవ్‌మెంట్లమీద, కుళ్ళి కాలువల్లో పడిపోతున్నారు

ఎదిగిపోయిన సమాజం ఆ కుళ్ళులో పడిపోయి, కుళ్ళి కంపు కొడుతున్న తన జాతి మనుషుల్ని, ఇంట్లో పెంచుకున్న కుక్కలకంటే హీనంగా చూస్తూ .. పరజాతి ప్రేమను అభివృద్ధిలోకి తెస్తుంది....మనుషులందరూ ఒక్కటే కాకపోయినా ప్రాణులన్నీ సమానమే అన్న పెద్ద ఉద్యమాన్ని కొనసాగిస్తుంది

సత్తిగాడి సలైవరీగ్లాండ్స్ అంటే తెలీవు.... సలైవా అన్నా, సలైవరీ ఎమైలేజ్ అన్నా అంతకంటే తెలీదు . . అయినా వాడి నోట్లోంచి లాలాజలం కారుతుంది... ధారలా... జలపాతంలా... సెలయేరులా.... కారుతుంది, సాగుతుంది శరీరంలో ప్రతి అణువూ కరిగిపోయి లాలాజలమైపోతుంది .

వాడి కడుపు నిండాలంటే....ఆ లాలాజలధార ఆగాలంటే. అందులో కరిగేంత ఆహారం కావాలి.... అక్కడ అంతకంటే వెయ్యిరెట్ల ఆహారం ఉంది...కానీ వీడికోసం ఒక్క ముద్ద ఒక్క ముక్క ఒక్క చుక్క లేదు

పేర్లు తెలియని ఆ పదార్థాలు నోరూరిస్తున్నాయి కడుపులో ప్రేవుల్ని ఆనంద నాట్యం చేయిస్తున్నాయి

వాడెప్పుడు తిన్నాడో వాడికే తెలీదు... ఆ ప్రేవులకే తెలుసు తమని నింపమని పోరు పెడుతున్నాయి. . గోడు చేస్తున్నాయి సత్తిగాడి కాళ్ళు, చేతులు వణుకుతున్నాయి.. ఖాళీగుండె దబ్ దబ్ మంటుంది

గేటు తలుపు తీసేఉంది అందరూ

ఎంతో హడావుడిగా, ఆనందంగా, హుందాగా, అందంగా నవ్వుకుంటూ తిరుగుతున్నారు. తుళ్ళి తుళ్ళి పడుతున్నారు

ఎవరి దృష్టి సత్తిగాడిమీద లేదు

సత్తిగాడి కడుపులో ఆకలి గుండెలో దూరి ధైర్యంగా మారింది అది వాడి నోట్లోని లాలాజలంలో పడవలా పరుగులు తీస్తుంది. వాడిని ముందుకు పదమంటుంది

ఓపికలేని రెండు 'కర్రలు' కొద్దిగా వణికాయి... పురివిప్పి నాట్యంచేసే ఆకలి ధైర్యాన్ని పురికొల్పింది

ఎదురుగా బల్లమీద . ఓ మూలగా... ఓ పదార్థం సత్తిగాడి ఆకలికి పసందైన మందు . వాడిని 'రారమ్మని' సైగచేసింది ధైర్యం ... 'వెళ్ళరా' అని ముందుకు తోసింది

నేను క్రింద పడిపోతున్నాను. మట్టిలో పడిపోబోతున్నాను... నన్నెవరూ గమనించడం లేదు.. రా. మట్టిలో పడిపోతున్న నన్ను రక్షించి నీ కడుపులో దాచుకో ఎదురుగా కన్పిస్తున్న ఆ పదార్థం పిలుస్తుంది

వెళ్ళరా...వెళ్ళు ఓపికతో ఒక పది అడుగులు వెయ్యి దాన్నందుకో అంత సందడిలో వాళ్ళెవ్వరూ నిన్ను పట్టించుకోరు ఆనందంతో వాళ్ళ కళ్ళు మూసుకుపోయినై ... నువ్వు వాళ్ళకు కనబడవు... వెళ్ళు... వెళ్ళరా... కదలవేం...? ధైర్యం గుణుస్తుంది...

గేటుతీసి ఒక పది అడుగులువేస్తే ఆ బల్ల దానిమీద ఆకలికి మందు... అమృతం చేతికొస్తుంది

కీచుమని గేటు శబ్దం సత్తిగాడి కాళ్ళు కదిలాయి కళ్ళు పరిసరాల్ని బెరుగ్గా పరిశీలిస్తున్నాయి ఎవ్వరూ చూడడంలేదు ధైర్యం పొగరు పెరిగింది బల్లదగ్గరకు పరుగు తీసింది

సత్తిగాడి చేయి ఆతృతగా, చిన్నగా వణుకుతూ పైకిలేచింది....

అంతే! బలిసి బరువెక్కిన ఒక చేయి . ఆ బక్కచిక్కిన చేయిని చటుక్కున పట్టుకుంది

"ఒరే ఎవర్రా నువ్వు ? నడు ముందు .. బయటికి నడు ముష్టివెధవా!"

బక్కచిక్కిన చేయికి ప్రాణం పోయింది...ధైర్యం తోకముడిచేసింది... ఆకలి ప్రేవులో ఓ మూల దాక్కుండి పోయింది .

దండిగా బొజ్జపెరిగిన ఆ ఆసామీ కళ్ళెర్రజేసి.. నెత్తిమీద ఒకటిచ్చి బయటకు తగిలేసాడు సత్తిగాడిని

మరలా... గేటు... కుక్కలున్నాయి జాగ్రత్త బోర్డు ఎదురుగా వెన్నెల్ని కురిపించే దీపాలు బల్లమీద ఆ పదార్థం దానిపైపు సత్తిగాడి వెర్రి ఆకలిచూపులు గుండెలో ఎండి

పోయిన రక్తం కడుపులో నిండి పోయిన ఆకలి అది ఆవురావురు మంటుంది గెంతుతుంది చిందు లేస్తుంది హాహాకారాలు చేస్తుంది..

కాలం నిర్బంగా నడుస్తుంది భారంగా అడుగులేస్తుంది

పాలిపోయిన కళ్ళు కన్నీటిని తోడే స్తున్నాయి కళ్ళు తిరుగుతున్నాయి కాళ్ళు వణుకుతున్నాయి ఒళ్ళు తేలిపోతుంది

అక్కడ ఎందరో మనుష్యులు గుంపులు గుంపులుగా మందలు మందలుగా. అందరూ ఆనందంగా నవ్వుకుంటున్నారు. సంతోషం వాళ్ళ గుండెల్లో నిండిపోతుంది వాళ్ళ దృష్టి అసలు ఆ తిండివైపు లేదు. ఒకర్నొకరు ఆడ, మగ మగ, ఆడ .. ప్రేమగా, ఆదరంగా, ఆరాధ నగా మాట్లాడుకుంటున్నారు

సత్తిగాడు అటువైపే చూస్తున్నాడు... వాడు చూసేది వాళ్ళ బట్టలవైపు కాదు ఒంపుసొంపుల్ని సొంపుగా మలచుకొని, వింతగా సింగారించుకున్న ఆ కన్నెలేడి పిల్లలనూ కాదు వాళ్ళు విసిరే చూపుల బాణాల్నీ, నవ్వుల పూబంతుల్నీ కాదు వాడి దృష్టి అంతా ఆ టేబుళ్ళమీద ఆ పదార్థాలమీదే ఉంది

కాలం ఆగడం లేదు. నడుస్తూనే ఉంది ఓపిగ్గా..

నెమ్మది నెమ్మదిగా గుంపులు విడిపో తున్నాయి కొంతసేపటికి అందరూ తమ తమ సీట్లల్లో కూర్చున్నారు .. ఎవరెవరో వాళ్ళకు వద్దన్నా కొసరి కొసరి ఎన్నెన్నో పదార్థాల్ని వడ్డిస్తు న్నారు వడ్డిస్తుంటే ఆ ప్రదేశమంతా ఘుమ ఘుమ లాడిపోతుంది సత్తిగాడి నోట్లో లాలాజల సముద్రం దాని కెరటాలు ఉవ్వెత్తున లేస్తున్నాయి ఆకలి భగభగమని మండిపోతుంది బడ బాగ్నిలా

తనకు చేరువలో గేటుకు పది అడుగుల దూరంలో ఉన్న ఆ బల్ల ముందు రెండు కుర్చీలు ఖాళీగా ఉన్నాయి అప్పుడే ఎవరోవచ్చి రెండు ప్లేటల్లో వడ్డించి వెళ్ళారు వీచేగాలి ఆ ఘుమఘుమతో నిండిపోతుంది.... సత్తిగాడి ముక్కుపుటాల్ని అదిరించే స్తుంది లాలాజల సంద్రాన్ని అల్లకల్లో లం చేసేస్తుంది

అంతలో ఎవరో ఇద్దరు వచ్చారు. .. అందులో ఒకాయన ఇందాక సత్తిగాడి చేతిని పట్టుకున్నాయన బొజ్జపెరిగిన గుజ్జురూపధరుంపె వాళ్ళిద్దరి చేతుల్లో రెండు ఇనుపగొలుసులు... ఆ గొలుసుల చివర రెండు జూలుకుక్కలు.... సింహాల్లా ఉన్నాయి అరిస్తే ఆకాశం దద్దరిల్లేలా ఉన్నాయి ... జూలు విదిలిస్తే అక్కడున్నగాలికి ఆమడదూరం పారి పోయేట్టుగా ఉన్నాయి....

ఆ రెండు కుక్కలూ (అనొచ్చా?)

చటుక్కున కుర్చీలమీదకు ఉరికాయి ఆ ఉరకడంలో ఇందాకట్నించీ బల్లకు చివరగా ఓ మూల ఉన్న ఆ పదార్థం క్రింద పడిపోయింది సత్తిగాడి ప్రాణం విలవిల్లాడింది. అంత ఘుమ ఘుమలాడుతున్న ఆ పదార్థాల్ని మామూలుగా వాసన చూసి....తీరుబడిగా, కొంచెం కొంచెం తినడం మొదలు పెట్టాయి ఆ కుక్కలు.

కుక్కలు ఏ జన్మనెత్తినా మంచి జాతకంతో పుట్టాలి

వాటిని చూస్తుంటే అవి కుక్కలన్న భావమే కలగడంలేదు సత్తిగాడికి.... నాకూ వాటిలాగే అరుపొచ్చి ఒంటి మీద తెల్లని జూలు పెరిగితే ఎంత బావుణ్ణు నేనూ ఆ కుర్చీలో ... తీవిగా సత్తిగాడి ఆకలి పిడుగులా పెళపెళమంటుంది.

బాధ సహించలేకపోతున్నాడు..

అంతలో ఆ కుక్కలు రెండూ.... అయిష్టంగా ఆ పదార్థాల్ని వదిలేసి.... ఒక్కసారి అదోలా అరచి .. కుర్చీలు దిగిపోయి తీవిగా నడుచుకుంటూ ఆ గోడ ప్రక్కకు వెళ్ళిపోయి అటూ ఇటూ తిరుగుతున్నాయి..

బల్లమీద ఆ చక్కని కుక్కలు రుచిచూసి వదిలేసిన నీటైన తిండి ఆ బల్లక్రింద ఇందాక పడిపోయిన ఆ పదార్థం సత్తిగాడిని తహతహ లాడిస్తున్నాయి

ఎంతసేపు గడిచినా వాళ్ళింకా తింటూనే ఉన్నారు నెమ్మదిగా, నాజూగ్గా, ఆనందంగా నవ్వుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ అలా తింటూనే ఉన్నారు ఆకలెరుగని వాళ్ళ కడుపులు. ఆతృత పడటంలేదు

కానీ సత్తిగాడిలో ఆకలి చెలరేగిపోతుంది ఆ పసివాడి హృదయంలో దావానలం సృష్టిస్తుంది కోరికను, తెగింపును పెంచేస్తుంది పిరికిదనాన్ని పారద్రోలేస్తుంది

ఎవరి గొడవలో వాళ్ళున్నారు ... ఆనంద సాగరంలో మునిగి తేలుతున్నారు

ఆతృత, తెగింపు అవకాశాన్ని చూపించాయి

మళ్ళా గేటు కీచుమని నెమ్మదిగా, రహస్యంగా మూలిగింది సత్తిగాడి కాళ్ళు నెమ్మదిగా ముందుకు నడిచాయి...

పది అడుగులు దూరం చేరువయ్యింది

ఆకలి అలిసిపోయినా ఆనందంతో పొంగిపోతుంది .

బల్ల క్రిందకు వంగి ఆ పదార్థాన్ని అందుకోబోయేంతలో ముక్కుపుటాలదిరిపోయే వాసన...పుట్టిన తర్వాత వాడెప్పుడూ ఎరుగని వింతైన సువాసన...

వాడక్కడే ఆగిపోయాడు చేతిని ముందుకు జరిపితే చాలు అంది పోతుంది ఆ తర్వాత కడుపు నిండిపోతుంది . ఆకలి అరుపు ఆపేస్తుంది..

సత్తిగాడిచేయి ముందుకు కదిలింది...

దాన్నందుకుంది కుక్కలు ఎంగిలి చేసిన ఒక కోడికాలు ఘుమఘుమ లాడే కోడికాలు.. సత్తిగాడి చేయి నలంకరించింది

వాడి గుండెలో సెలయేరు పరుగు. కోటి దీపాల వెలుగు

వెంటనే వెనక్కి తిరిగాడు గబ గబా అడుగులు వేసాడు

రెండడుగులు వేస్తే గేటు అది దాటితే తినెయ్యొచ్చు.... కడుపునిండా తినెయొచ్చు ఆకలి తీర్చుకోవచ్చు అంత రుచిగా ఉండే కోడికాలు తినెయొచ్చు సత్తిగాడి గుండెలో వేగం ఆతృత

అంతలో ఏదో మెడను పట్టుకుంది.... వెనక్కి తిరిగి చూడబోయేంతలో చెంప ఛెళ్ళుమంది

ఆకాశం భూమి కలిసిపోయినట్లయ్యింది చెవిగూబ ఇంకా 'గుయ్' మంటూనే ఉంది

కుప్పకూలిపోయాడు సత్తిగాడు

చీపురు పుల్లలాంటి వాడి చేతినందుకొని లేపాడు అతను.. .భయంగా కళ్ళు తెరచి చూశాడు సత్తిగాడు.. కళ్ళల్లో ప్రాణం అతన్ని గుర్తుపట్టింది

అతనే. ఇందాకటి అతనే యమరూపం

వెంటనే సత్తిగాడి వీపు చెంపలు

ఛడేల్ ఛడేల్ మన్నాయి

సత్తిగాడు నేలబడిపోయాడు

బలమైన చేయి వాడ్ని బరబరా ఈడ్చుకుపోయింది.

గేటుదాటి, గోడ అవతల దూరంగా వాడ్ని విసిరేసింది ఎంగిలాకులా.

బట్టల్లోలేని కుసంస్కారం బండగా, అమానుషంగా, అసహ్యంగా తిట్టుకుంటూ పార్టీలో కలిసిపోయింది. ఆనందంలో మునిగిపోయింది..

పార్టీ జోరుగా సాగిపోతుంది .. ఆనందంతో ఊగిపోతుంది

గోడ అవతల ఉడకబెట్టేసిన మాంసం వంటబట్టని ఆ ఇంటి జూలుకుక్కలకు ఎండిపోయిన రక్తంతో నిండిన పచ్చి మాంసం పసందైన విందుచేస్తుంది